క్లుప్తంగా

మందుబాబులకు జరిమాన

సిద్దిపేటకమాన్: మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడిన వాహనదారులకు సిద్దిపేట కోర్టు జరిమాన విధించింది. ట్రాఫిక్ సీఐ ప్రవీణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం పట్టణంలోని పలు ప్రాంతాలలో తమ సిబ్బందితో కలిసి వారం రోజుల క్రితం నిర్వహించిన తనిఖీలలో 13మంది మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడ్డారు. వారిని మంగళవారం సిద్దిపేట కోర్టులో హాజరుపర్చగా విచారణ జరిపిన న్యాయమూర్తి వారికి రూ.19,500 జరిమానా విధించినట్లు సీఐ తెలిపారు.

లైబ్రరీకి స్టడీ మెటీరియల్



స్టడీ మెటీరియల్ అందజేస్తున్న బీఎన్ రావు

హుస్నాబాద్: పోటీ పరీక్షలకు అవసరమయ్యే స్టడీ మెటీరియల్‌ను బీఎస్.రావు ఫౌండేషన్ స్థానిక లైబ్రరీకి మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ బీఎస్.రావు మాట్లాడుతూ విద్యార్థులు పోటీ పరీక్షలపై సరైన అవగాహన ఏర్పరుచుకోవాలన్నారు. మిగతా దేశాల కంటే చదువుకున్న యువత మనదేశంలోనే ఎక్కువగా ఉందని, అందుకు అనుగుణంగా ఉద్యోగ కల్పన ఉండాలని, అప్పుడే దేశం అభివృద్ధి చెందుతుందని చెప్పారు. కళాశాల నుంచే అప్రెంటిస్‌షిప్ విధానాన్ని ప్రవేశపెట్టి, ఐటీఐలో టెక్నాలజీని పెంపొందించాలని అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మురళీమోహన్, న్యాయవాది దినేశ్ తదితరులు పాల్గొన్నారు.

కళాశాలలో స్వచ్ఛ భారత్



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ శోభాదేవి

హుస్నాబాద్: పౌరులందరూ ఆరోగ్యంగా ఉన్నప్పుడే సమాజం ప్రగతి పథంలో నడుస్తుందని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కందుల శోభాదేవి అన్నారు. జాతీయ సేవా పథకం(ఎన్ఎస్ఎస్) ఆధ్వర్యంలో కళాశాలలో స్వచ్ఛభారత్ కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థినులు కళాశాల ఆవరణలో చెత్తను తొలగించారు. మొక్కలకు నీళ్లు పోశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ప్రజలంతా సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి కర్ణాకర్, అధ్యాపకులు రవీందర్, సదానందం, నిర్మలాదేవి, లక్ష్మయ్య, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

జీవసాంకేతిక విజ్ఞానంపై సదస్సు



అవగాహన కల్పిస్తున్న అధికారులు

ములుగు(గజ్వేల్): ములుగు అటవీ కళాశాల, పరిశోధన కేంద్రం(ఎఫ్‌సీఆర్ఐ)లో మంగళవారం అటవీ పరిరక్షణలో జీవ సాంకేతిక విజ్ఞానం అనే అంశంపై ఉపాధ్యాయులు విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఉపాధ్యాయురాలు షాలిని ముదాల్కర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సదస్సుకు యూఓహెచ్ ప్రొఫెసర్ అట్టిపల్లి రెడ్డి, ఎస్ఆర్ఎస్‌సీ ప్రిన్సిపల్ సైంటిస్టు సుధాకర్‌రెడ్డి, సీఎస్‌జెఎం అసిస్టెంట్ ప్రొఫెసర్ శ్రీహర్ష పాల్గొని జీవసాంకేతిక గురించి విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో డీన్ ఎస్‌జే ఆశ, పలువురు డైరెక్టర్లు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి



వినతిపత్రం చూపుతున్న కార్మికులు

బెజ్జంకి(సిద్దిపేట): ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన ఏజెన్సీ సభ్యులు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి మీసం లక్ష్మణ్ డిమాండ్ చేశారు. కార్మికుల సమస్యలపై ఎంఈఓ కార్యాలయంలో మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మధ్యాహ్న భోజన నిర్వహణ కార్యక్రమాన్ని ప్రైవేటు వ్యక్తులకు అప్పగించవద్దన్నారు. రూ.10వేల వేతనం అందించాలని కోరారు. అలాగే మెస్ చార్జీలు పెంచాలని, కోడిగుడ్లను ప్రభుత్వమే సరఫరా చేయాలని కోరారు. కార్యక్రమంలో బాబు, నర్సవ్వ, కొంరవ్వ, కనుకయ్య, రామవ్వ, సూరవ్వ తదితరులు పాల్గొన్నారు.

పిచికారీలో నిర్లక్ష్యంవద్దు

- రక్షణ చర్యలు తీసుకోవాలి
- లేకుంటే ప్రాణాలకే ముప్పు
- ఏఓ జయంత్ కుమార్





పత్తి పంటకు మందు పిచికారీ చేస్తున్న రైతు

చిన్నకోడూరు(సిద్దిపేట): రైతులు తమ పంటలకు సోకే చీడపీడల నివారణకు పురుగు మందులు పిచికారీ చేస్తుంటారు. ప్రస్తుతం రసాయనిక మందుల వాడకం తప్పనిసరైంది. ఈ మందులతో చాలా ఇబ్బందులున్నాయి. పిచికారీ చేసేవాళ్లు సరైన జాగ్రత్తలు పాటించకపోతే ప్రాణాలకే ప్రమాదం. చాలా సందర్భాల్లో స్ప్రేచేసే వ్యక్తికి ఆరోగ్యం వికటించి ఆస్పత్రిపాలైన ఘటనలు ఎక్కువనే ఉన్నాయి. ఆదమరిస్తే ప్రాణనష్టం జరిగే ప్రమాదం ఉంది. ఈ నేపథ్యంలో మందుల పిచికారీలో రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై మండల వ్యవసాయ అధికారి జయంత్ కుమార్ పలు సూచనలు చేశారు.

పిచికారీకి ముందు..

- మందు పిచికారీకి పరిశుభ్రమైన నీటిని వాడాలి. అలాగే చేతులు, కళ్లు, ముక్కు, నోరు, చెవులకు ప్రత్యేక రక్షణ తీసుకోవాలి.
- తలకు టోపీతోపాటు ముఖం మొత్తం కప్పుకోవాలి.
- పురుగు మందులతో వచ్చిన కవర్లు వినియోగించొద్దు.
- ద్రావణాన్ని కలిపే ముందు డబ్బాపై ఉన్న లేబిల్‌ను అనుసరించి కలుపుకోవాలి.
- మందు కలిపేటప్పుడు కచ్చితంగా కళ్లజోడు పెట్టుకోవాలి. లేకపోతే కళ్లలో పడి చూపు కోల్పోయే అవకాశం ఉంది.
- ద్రావణాన్ని పంపులో పోసేటప్పుడు, పిచికారీ చేసేటప్పుడు బీడీ, సిగరెట్, ఖైనీ వంటివి నమలకూడదు.
- మందును ముక్కుతో వాసన చూడొద్దు. పిచికారీ తర్వాత, భోజనం చేసేటప్పుడు సబ్బుతో చేతులు శుభ్రంగా కడుక్కోవాలి.

పిచికారీ చేసే విధానం..

- పిచికారీచేసే డబ్బా సరైనది ఎంచుకోవాలి. డబ్బా లోపలి నుంచి లీక్ అవకుండా చూసుకోవాలి.
- సరైన నాజిల్ ఎంచుకోవాలి. పిచికారీ సమయంలో నాజిల్‌లో ఎదైనా అడ్డుపడితే నోటితో ఊదకూడదు.
- పురుగు మందులు, కలుపు మందులు నివారణకు ఒక డబ్బాను ఉపయోగించకుండా ఉంటే మంచిది.
- గాలి ఎక్కువగా వీచేటప్పుడు, ఎండ ఎక్కువగా ఉన్నప్పుడు పిచికారీ ప్రయత్నాలు మానుకోవాలి.
- పిచికారీ సమయంలో గాలివస్తే గాలి దిశకు వ్యతిరేకంగా పిచికారీ చేయకుండా గాలి వాలుకు అనుగుణంగా చేసుకోవాలి.
- పిచికారీ చేసిన తరువాత మందు డబ్బాలను విచ్చలవిడిగా పడేయకూడదు. మందు మిగిలిన డబ్బాలను నివాస ప్రాంతాలకు దూరంగా ఉంచాలి.

సమన్వయంతో సాగుదాం

- మున్సిపల్ చైర్ పర్సన్ మంజులరాజనర్స్
- పట్టణ ప్రగతి నిధుల మళ్లింపుపై అభ్యంతరం
- విపక్ష సభ్యుల వాకౌట్.. నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న విపక్ష కౌన్సిలర్లు

సిద్దిపేటజోన్: సిద్దిపేట మున్సిపల్ పరిధిలోని ప్రజల సమస్యలను సమన్వయంతో పరిష్కరించాలని, అందుకు అధికారులు సమష్టిగా సమన్వయంతో సాగాలని మున్సిపల్ చైర్ పర్సన్ మంజులరాజనర్స్ సూచించారు. మున్సిపల్ సమావేశ మందిరంలో ఆమె అధ్యక్షతన మంగళవారం కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విషజ్వరాలపై అప్రమత్తంగా ఉండాలని, అందుకు మున్సిపల్, వైద్య సిబ్బంది వార్డుల్లో అందుబాటులో ఉండాలని, ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వం నిధులు మంజూరు చేసిన వెంటనే ఆయా వార్డుల్లో పెండింగ్‌లో ఉన్న పనులను చేపడతామని చెప్పారు. విద్యుత్ సిబ్బంది చెట్లను నరకవద్దని, కేవలం వైర్లను తాకే కొమ్మలను మాత్రమే ట్రిమ్మింగ్ చేయాలని సూచించారు.

కౌన్సిల్ దృష్టికి సమస్యలు

ఈ సందర్భంగా వివిధ వార్డుల్లో నెలకొన్న సమస్యలను సభ్యులు కౌన్సిల్ దృష్టికి తీసుకువచ్చారు. యూజీడీ సమస్యలు పరిష్కరించాలని, తాగునీరు కలుషితం కాకుండా చూడాలని, వినాయక చవితి సందర్భంగా మండపాలకు ఉచితంగా విద్యుత్ ఇవ్వాలని, కుక్కల బెడదకు చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం 31అంశాలతో కూడిన అజెండాను ఏకగ్రీవంగా ఆమోదించారు. కమిషనర్‌గా పూర్తి అదనపు బాధ్యతలు స్వీకరించిన ప్రేరణ పాండను కౌన్సిల్ సభ్యులు అభినందించారు.

పట్టణ ప్రగతి నిధుల కేటాయింపు సరికాదు

కౌన్సిల్ అజెండా అంశంలో పట్టణ ప్రగతి నిధులను వివిధ పనుల నిర్వహణ కోసం కేటాయించిన విషయంపై విపక్ష సభ్యులు అభ్యంతరం వ్యక్తం చేశారు. కొన్ని కులసంఘాల కమ్యూనిటీ హాల్స్ వద్ద విద్యుత్ మరమ్మతులు, గాడిచర్ల పల్లి, లింగారెడ్డి పల్లి, శివాజీ నగర్ ప్రాంతాల్లో పలు పనులకు నిధులను కేటాయిస్తూ తీర్మానాన్ని ఆమోదించడానికి కౌన్సిల్ ముందు పెట్టడంపై వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ చర్యను నిరసిస్తూ కాంగ్రెస్ సభ్యులు రియాజ్, శ్రీదేవిబుచ్చిరెడ్డి, బాల్‌లక్ష్మి ఆనంద్, అలకుంట కవిత, బీజేపీ సభ్యులు రాధవేణుగోపాల్, ఎంఐఎం సభ్యులు హర్షద్ సమావేశం నుంచి వాకౌట్ చేశారు. చైర్‌పర్సన్ మంజుల జోక్యం చేసుకొని విపక్ష సభ్యులు వాకౌట్ చేయడం సరికాదన్నారు. అనంతరం విపక్ష సభ్యులు బల్దియా ద్వారం వద్ద బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా శ్రీదేవి, రియాజ్, రాధ మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులు, సిబ్బందికి వేతనాల సమస్య పరిష్కరించకుండా తమ ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. పట్టణ ప్రగతి నిధులు దుర్వినియోగంపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని చెప్పారు. సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్ కనకరాజు, కౌన్సిలర్లు సుందర్, వినోద్, బ్రహ్మం, లక్ష్మణ్, మల్లికార్జున్, సాయి ఈశ్వర్, యోగి, రవి, కవిత, దీప్తి, రేణుక, కవిత, భాగ్యలక్ష్మి, రేఖ, రేణుక, శ్రీలత, తస్లీమ్, జయ, శోభారాణి, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

మున్సిపాలిటీలోను హైడ్రా ఏర్పాటు చేయండి

- బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జి



మాట్లాడుతున్న బీఎస్పీ నాయకులు

హుస్నాబాద్: హైదరాబాద్‌లోని అక్రమ నిర్మాణాలపై హైడ్రా అధికారులు కొరడా ఝుళిపించడం మంచి కార్యక్రమం అని బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జి పచ్చిమట్ల రవీందర్ గౌడ్ అన్నారు. బీఎస్పీ కార్యాలయంలో మంగళవారం ఆయన మాట్లాడుతూ ఇటువంటి మంచి కార్యక్రమాలను అన్ని పార్టీలు, సామాజిక ఉద్యమకారులు స్వాగతించాలన్నారు. అదే విధంగా హుస్నాబాద్ మున్సిపాలిటీలో హైడ్రా ఏర్పాటు చేయాలని మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కోరారు. మున్సిపాలిటీ పరిధిలో దాదాపు వందల ఎకరాల ప్రభుత్వ భూములు కబ్జా చేశారని వాపోయారు. విలువైన భూములు కోల్పోవడంతో ప్రభుత్వ కార్యాలయ భవన నిర్మాణాలకు స్థలం లేక ఇబ్బంది పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సమావేశంలో నియోజకవర్గ అధ్యక్షుడు వెల్పుల రాజు, నాయకులు శంకర్, సుధాకర్, రవీందర్, మహేశ్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

మండలాలకు విస్తరించాలి..

బెజ్జంకి(సిద్దిపేట): భూ అక్రమాలకు పాల్పడ్డ వారి భరతం పడుతున్న హైడ్రాను మండలాలకు కూడా విస్తరించాలని ఆర్‌టీఐ ప్రచార కమిటీ చైర్మన్, కాంగ్రెస్ నాయకులు రాసూరి మల్లికార్జున్ మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. గత ప్రభుత్వంలో ఆక్రమణలకు పాల్పడ్డ నాయకుల భూములను స్వాధీనం చేసుకోవాలని డిమాండ్ చేశారు.

విద్యుత్‌కు అంతరాయం

కోహెదరూరల్(హుస్నాబాద్): మండలంలోని బస్వాపూర్‌లోని పెద్దమ్మగుడి వద్ద ఎల్కతుర్తి–సిద్దిపేట రోడ్డు విస్తరణలో భాగంగా 11కేవీ, ఎల్‌టీ లైన్ షిఫ్టింగ్ పనులు జరుగుతున్నాయి. దీంతో బస్వాపూర్ పరిధిలోని ఆరెపల్లి, చంద్రనాయక్ తండాలకు ఉదయం 9.30నుంచి 12.30వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని ఏఈ మనోజ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు.

ఏఎస్ఐ శ్రమదానం



గుంతను పూడ్చిన శంకర్‌రావు తదితరులు

బెజ్జంకి(సిద్దిపేట): మండలంలోని గాగిళ్లాపూర్‌కు వెళ్లే రోడ్డుపై గుంతలు ఏర్పడి ప్రమాదకరంగా మారింది. బెజ్జంకి ఏఎస్ఐ శంకర్‌రావు మంగళవారం శ్రమదానం చేసి వాటిని పూడ్చారు. గుంతలో బండరాళ్లు, మట్టివేసి చదును చేశారు. దీంతో గ్రామస్తులు ఆయనను అభినందించారు. కార్యక్రమంలో కానిస్టేబుల్ శ్రీనివాస్, రాజు స్థానికులు పాల్గొన్నారు.

అక్కన్నపేట ఏఈఓగా సంగీత

సాక్షి ఎఫెక్ట్..



దరఖాస్తులను పరిశీలిస్తున్న ఏఈఓ సంగీత

అక్కన్నపేట(హుస్నాబాద్): స్థానిక ఏఈఓగా సంగీత మంగళవారం బాధ్యతలు చేపట్టారు. రైతుల నుంచి రుణమాఫీ దరఖాస్తులను స్వీకరించారు. గత 25న ‘వేదికకు తాళం.. రైతులు ఆగం’ అనే శీర్షికన సాక్షిలో ప్రచురితమైన కథనానికి జిల్లా వ్యవసాయ అధికారులు స్పందించారు. దీంతో వెంటనే ఏఈఓను నియమించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గజ్వేల్ నుంచి బదిలీపై వచ్చి శనివారం బాధ్యతలను చేపట్టానన్నారు. రైతులకు రుణమాఫీపై ఏదైనా సమస్య ఉంటే నేరుగా వచ్చి దరఖాస్తులను అందజేయాలని చెప్పారు. అలాగే పంటసాగుపై సలహాలు, సూచనలను ఎప్పటికప్పుడు రైతులకు అవగాహన కల్పిస్తామని తెలిపారు.

అమ్మకు అపన్నహస్తం

– సాక్షి కథనానికి స్పందన



సాక్షిలో ప్రచురించిన కథనం

సిద్దిపేటజోన్: కన్నబిడ్డ ఆకలి తీర్చడానికి దివ్యాంగుడైన కొడుకు ట్రై సైకిల్ నెట్టుకుంటూ భిక్షాటన చేస్తున్న ఓ తల్లీ వైనంపై 25న సాక్షి మెయిన్‌లో ప్రచురించిన ‘మా తుజే సలాం’కు ఒక మనస్సున్న వ్యక్తి స్పందించారు. హైదరాబాద్‌కు చెందిన చార్లెస్ బాబులాల్ తనవంతు సాయంగా రూ.5వేలు మంగళవారం పంపించి మంచి మనస్సును చాటుకున్నాడు.

చికిత్స పొందుతూ మృతి



మద్దూరు(హుస్నాబాద్): చికిత్స పొందుతూ ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలోని ధర్మారంలో చోటు చేసుకుంది. ఎస్ఐ షేక్ మహబూబ్ తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన జక్కుల శేఖర్(32) కొన్ని రోజులుగా మద్యానికి బానిసయ్యాడు. ఈ క్రమంలో గత 20న పురుగుల మందుతాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అది గమనించిన కుటుంబ సభ్యులు అతడిని ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో మంగళవారం మృతి చెందినట్లు ఎస్ఐ తెలిపారు.

28 వరకు స్పాట్ అడ్మిషన్లు

కొండపాక(గజ్వేల్): మండలంలోని దుద్దెడలోగల సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల (కళాశాల)లో ఖాళీ ఉన్న సీట్ల భర్తీకి స్పాట్ అడ్మిషన్లను 28వరకు తీసుకుంటామని ప్రిన్సిపాల్ సతీశ్ తెలిపారు. ఇంటర్ ఎంపీసీ ప్రథమ సంవత్సరంలో నాలుగు సీట్లు ఖాళీగా ఉన్నాయని అందులో ఎస్సీ కోటాలో మూడు, జనరల్ కోటాలో ఒకటి దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. అర్హత గల విద్యార్థులు ఆరోజు ఉదయం 9గంటలకు సెంటర్‌లో ఉండాలని కోరారు.

గుడిలోకి రానివ్వకపోవడం అమానుషం

- డీబీఎఫ్ జాతీయ కార్యదర్శి శంకర్



నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

మర్కూక్(గజ్వేల్): దళితులను ఆలయంలోకి రానివ్వకుండా ఇతర కులాల వారు అడ్డుకోవడం అమానుషమని డీబీఎఫ్ జాతీయ కార్యదర్శి శంకర్ ఆవేదన వ్యక్తం చేశారు. మండలంలోని శివారు వెంకటాపూర్‌లోని దుర్గమ్మ ఆలయంలోకి బోనాలతో వస్తున్న దళితులను అడ్డుకుని అంటరానితనాన్ని పాటించి అవమానించిన ఘటనపై మంగళవారం డీబీఎఫ్, కేవీపీఎస్ నాయకులు గ్రామానికి చేరుకున్నారు. ముందుగా గ్రామంలో ఎల్లమ్మ, మాతమ్మ, దుర్గమ్మ ఆలయాల్లో దళితులతో పూజలు చేయించారు. అనంతరం పోలీస్‌స్టేషన్ ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దుర్గామాత బోనాల పండుగలో దళితులు తీసుకు వచ్చిన బోనాలను ఆలయాల్లోకి రాకుండా అడ్డుకోవడం దారుణమన్నారు. కలెక్టర్, సీపీ గ్రామాన్ని సందర్శించి దళితులకు ఆలయ ప్రవేశం చేయించి హక్కులను కాపాడాలని కోరారు. ఎస్ఐ, సీఐలకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు ఎగొండస్వామి, వేణు, కృష్ణమూర్తి, నర్సింహులు పాల్గొన్నారు.

అయ్యప్పనగర్ కాలనీపై చిన్నచూపెందుకు

- మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం

గజ్వేల్‌రూరల్: అయ్యప్పనగర్ కాలనీపై అధికారులు, పాలకులకు చిన్నచూపెందుకని, తమకు రోడ్డు సౌకర్యం కల్పించాలని నాలుగేళ్లుగా విన్నవిస్తున్నా ఎందుకు పట్టించుకోవడం లేదని ఆ కాలనీవాసులు మండిపడ్డారు. పట్టణంలోని 15వ వార్డులోగల అయ్యప్పనగర్ కాలనీలోని వీధుల్లో రోడ్ల మరమ్మతులను వెంటనే చేపట్టాలని కోరుతూ కాలనీ సభ్యులు బండ్ల స్వామి, వీరారెడ్డిల ఆధ్వర్యంలో మంగళవారం మున్సిపల్ కమిషనర్ గోల్కొండ నర్సయ్యకు వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ గత ప్రభుత్వం మున్సిపాలిటీ పరిధిలో చేపట్టిన అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, సీసీ రోడ్డు పనుల ప్రారంభోత్సవం ఈ కాలనీలోనే చేపట్టిందని గుర్తు చేశారు. దీంతో తమ సమస్యలు పరిష్కారమవుతాయని ఆశించిన కాలనీవాసులకు నిరాశే మిగిలిందని వాపోయారు. ఇటీవల కురిసిన వర్షాలకు సత్య ఫంక్షన్‌హాల్ వీధి, రాజీవ్‌పార్కుకు వెళ్లే దారులన్నీ గుంతలమయమై ప్రమాదాలకు నిలయాలుగా మారాయని వాపోయారు. సమస్యలను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో రమేశ్‌గౌడ్, రాజేశం, మల్లేశం, నారాయణరెడ్డి, జీవన్‌రెడ్డి, చంద్రారెడ్డి, భాస్కర్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రహరీ నిర్మించి చెరువు ఆక్రమణ

- ఓ ప్రైవేట్ పరిశ్రమ నిర్వాకం
- అధికారులకు గ్రామస్తుల ఫిర్యాదు



ఎఫ్‌టీఎల్‌లో నిర్మించిన గోడ

ములుగు(గజ్వేల్): ములుగు మండలం బండతిమ్మాపూర్ పాలసముద్రం చెరువుపై ఓ ప్రైవేట్ పరిశ్రమ కన్నేసింది. రాత్రికి రాత్రే ప్రహరీ నిర్మింప జేసి కబళించేందుకు సన్నద్ధమైంది. ఈ ప్రయత్నాన్ని మంగళవారం గ్రామస్తులు అడ్డుకుని కొంతమేర ప్రహరీని కూల్చేశారు. అనంతరం ఇరిగేషన్ అధికారులకు ఫిర్యాదు చేశారు. పాలసముద్రం చెరువునకు 45ఎకరాల ఆయకట్టు ఉంది. చెరువు సమీపంలోని పరిశ్రమ ఎఫ్‌టీఎల్ భూమిని ఆక్రమించి ప్రహరీ నిర్మించింది. రూ.కోట్ల విలువైన చెరువు భూమి ఆక్రమణకు గురవుతోందని ఇరిగేషన్ అధికారులు తక్షణమే స్పందించి ఆక్రమణలను తొలగించాలని డిమాండ్ చేశారు. అక్రమ ప్రహరీ నిర్మాణం వాస్తవమేనని ఇరిగేషన్ ఏఈ ఓసామా చెప్పారు. చెరువుల్లో అక్రమ నిర్మాణాలకు పాల్పడితే చర్యలు తప్పవని, చెరువును సందర్శించి ఉన్నతాధికారులకు నివేదిస్తాని చెప్పారు.

పేకాట స్థావరంపై దాడి

సిద్దిపేటఅర్బన్: అర్బన్ మండలం కిష్టసాగర్ శివారులోని ఓ పేకాట స్థావరంపై టాస్క్‌ఫోర్స్ పోలీసులతో కలిసి దాడిచేసి పేకాట ఆడుతున్న వారిని అదుపులోకి తీసుకున్నట్లు త్రీటౌన్ సీఐ విద్యాసాగర్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ తమకు వచ్చిన సమాచారం మేరకు మంగళవారం దాడి చేయగా ఎన్సాన్‌పల్లికి చెందిన ఏడుగురు పట్టుబడ్డారని, నలుగురు పారిపోయారని చెప్పారు. వారి వద్ద నుండి రూ.17,720, ఆరు మొబైల్ ఫోన్లు, 10 బైకులు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. చట్టవ్యతిరేక కార్యక్రమాలకు ఎవరైనా పాల్పడితే సమాచారం అందించాలని సీఐ కోరారు.

కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులెక్కడ?

- సీపీఎం జిల్లా నేత ఎల్లయ్య



మాట్లాడుతున్న సీపీఎం నాయకులు

గజ్వేల్‌రూరల్: వివాహాలు జరిపించి సంవత్సరం దాటినా ప్రభుత్వం నుంచి కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు అందకపోవడంతో పేదలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ప్రభుత్వం స్పందించి వెంటనే పంపిణీ చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యుడు సందబోయిన ఎల్లయ్య డిమాండ్ చేశారు. మంగళవారం గజ్వేల్‌లో ఆయన మాట్లాడుతూ గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే కల్యాణలక్ష్మి పథకం కింద రూ.1,00,116తోపాటు తులం బంగారం ఇస్తామని ప్రకటించిందని గుర్తు చేశారు. ఎనిమిది నెలలు గడుస్తున్నా చెక్కులు అందలేదని వాపోయారు. సమావేశంలో సీపీఎం నాయకులు బండ్ల స్వామి, రంగారెడ్డి, వెంకటచారి, అహ్మద్, నర్సింహులు, కనకయ్య తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ మార్కండేయ మార్గంలో సాగాలి

తొగుట(దుబ్బాక): భక్తికి, ముక్తికి ముందు వరసలో నిలిచే భక్త మార్కండేయ మార్గంలో ముందుకు సాగాలని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి పిలుపునిచ్చారు. మండల కేంద్రంలోని మార్కండేయ ఆలయంలో ఘనంగా నిర్వహిస్తున్న విగ్రహ ప్రతిష్ఠోత్సవాల్లో మంగళవారం ఆయన పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయన వెంట రాంరెడ్డి, యాదగిరి, శ్రీనివాస్‌రెడ్డి, కొమురయ్య, రమేశ్, స్వామి తదితరులు ఉన్నారు.

◆ విద్యారంగ సమస్యలపై ఉద్యమించాలి

చేర్యాల(సిద్దిపేట): విద్యార్థుల సమస్యలపై ఉద్యమాలకు సిద్ధం కావాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ రామగల్ల నరేశ్ పిలుపునిచ్చారు. చేర్యాల డివిజన్ సమితి ఆధ్వర్యంలో మంగళవారం సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నరేశ్ మాట్లాడుతూ విద్యార్థులు సభ్యత్వం తీసుకోవాలన్నారు. అనంతరం గౌతమి ఒకేషనల్ జూనియర్ కళాశాల నూతన కమిటీని నియమించినట్లు చెప్పారు. ఆకుల శిరీష, కార్తీక్, యాసిన్, తేజ, శ్రావణి తదితరులు పాల్గొన్నారు.

◆ కవితకు బెయిల్.. బీఆర్‌ఎస్ సంబరాలు

హుస్నాబాద్: ఢిల్లీ మద్యం విధానంపై ఆరోపణలు ఎదుర్కొంటున్న ఎమ్మెల్సీ కవితకు సుప్రీం కోర్టు బెయిల్ మంజూరు చేయడంపై బీఆర్‌ఎస్ పార్టీ శ్రేణులు మంగళవారం సంబురాలు జరుపుకున్నాయి. టపాసులు పేల్చి, స్వీట్లు పంపిణీ చేశారు. ఆకుల వెంకట్, మున్సిపల్ మాజీ చైర్మన్ సుద్దాల చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

హనుమాన్ ఆలయంలో పూజలు..

మర్కూక్(గజ్వేల్): ఎమ్మెల్సీ కవిత కడిగిన ముత్యంలా మంగళవారం బెయిల్‌పై రావడం గర్వించదగ్గ విషయమని పీఏసీఎస్ వైస్ చైర్మన్ బాల్‌రాజు అన్నారు. ఎర్రవల్లి నుంచి వర్దరాజ్‌పూర్ వీరహనుమాన్ దేవాలయం వరకు బీఆర్‌ఎస్ నాయకులు పాదయాత్ర చేశారు. మాజీ ఎంపీటీసీ ధనలక్ష్మి, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

◆ హాస్టళ్లను సందర్శించండి

సిద్దిపేటకమాన్: అధికారులు, ప్రజాప్రతినిధులు హాస్టళ్లను సందర్శించాలని భారత్ ఐక్య విద్యార్థి ఫెడరేషన్ రాష్ట్ర కమిటీ నాయకులు డిమాండ్ చేశారు. ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం రాష్ట్ర కమిటీ సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న హాస్టళ్లు సమస్యలకు నిలయాలుగా ఉన్నాయన్నారు. రవి, తిరుపతి, వెంకటేశ్వర్లు, సందీప్ పాల్గొన్నారు.

◆ పేదలకు ఆసరా సీఎంఆర్‌ఎఫ్

కొండపాక(గజ్వేల్): సీఎంఆర్‌ఎఫ్ పేదలకు ఆసరాగా నిలుస్తోందని బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు నూనె కుమార్ పేర్కొన్నారు. మండల పరిధిలోని దుద్దెడలో కెమ్మసారం సతీశ్‌కు మంజూరైన రూ.36వేలు, అలాగే తిరుపతి సావిత్రికి రూ.15వేలు, తూర్పు వెంకటయ్యకు రూ.18వేలు, పంజా బాలయ్యకు రూ.8వేలు చెక్కులను మంగళవారం అందజేశారు. ఆయన వెంట శంభయ్య, శివకుమార్, హఫీజ్ తదితరులు ఉన్నారు.

◆ ప్రమాదాల నివారణ అందరి బాధ్యత

సిద్దిపేటఅర్బన్: రోడ్డు ప్రమాదాల నివారణ అందరి బాధ్యత అని ట్రాఫిక్ సీఐ ప్రవీణ్‌కుమార్ పిలుపునిచ్చారు. పొన్నాల ఫ్లై ఓవర్ బ్రిడ్జి వద్ద దాబాల యజమానులు, వర్కర్లకు రోడ్డు ప్రమాదాల నివారణపై మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ హెల్మెట్ ధరించి వాహనాలు నడపాలని, నిబంధనలు పాటించాలని చెప్పారు.

◆ శ్రీనివాస్‌కు డాక్టరేట్

సిద్దిపేటఎడ్యుకేషన్: ప్రభుత్వ డిగ్రీ, పీజీ అటానమస్ కళాశాల రసాయనశాస్త్ర అధ్యాపకుడు గాలి శ్రీనివాస్ శాతవాహన యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ అందుకున్నారు. ఈ సందర్భంగా మంగళవారం కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సునీత, అధ్యాపకులు శ్రీధర్, ఆంజనేయులు, డా.రవికుమార్, డా.భాస్కర్, డా.సుమలత, డా.బాలకిషన్ తదితరులు ఆయనను అభినందించారు. మనోహర్, వసుధ, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

అయ్యో పాపం..

- కంటతడి పెట్టిన కాలనీవాసులు

దుబ్బాకటౌన్: కుక్కల దాడిలో గాయపడిన వృద్ధురాలి దీన పరిస్థితిని చూసి కాలనీవాసులు కంటతడి పెట్టారు. పట్టణానికి చెందిన వృద్ధురాలు ఐయ్యంగారి రంగమ్మ 10 సంవత్సరాల నుంచి రేపల్లె వాడలోని గుడిసెలోనే జీవనం సాగిస్తుంది. కాలనీవాసులే ఆమెకు భోజనం పెడుతున్నారు. కుక్కలు దాడిలో తీవ్రంగా గాయపడి ఉండటం చూసి కాలనీవాసులు కన్నీటి పర్యాంతమయ్యారు.

ప్రాణాలు పోతున్నా పట్టదా?

కుక్కల దాడుల నేపథ్యంలో ప్రజలు అధికారులపై తీవ్రంగా మండిపడుతున్నారు. వరుసగా దాడి చేస్తూ ప్రజలను ఆస్పత్రుల పాలు చేస్తున్నా నిమ్మకు నీరెత్తిన్నట్లు వ్యవహరించడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. ఇకనైనా ఈ తరహా దాడులు జరగకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.